మంత్రి ఉత్తమ్‌కు కోదండ రామాలయ కమిటీ ఆహ్వానం



మంత్రి ఉత్తమ్‌ను ఆహ్వానిస్తున్న కోదండ రామాలయ కమిటీ సభ్యులు

నేరేడుచర్ల, ఏప్రిల్ 13 : నేరేడుచర్ల పట్టణంలో నూతనంగా నిర్మించిన కోదండ రామాలయ విగ్రహ ప్రతిష్ఠోత్సవ కార్యక్రమానికి హాజరు కావాలని కోరుతూ రాష్ట్ర భారీ నీటి పారుదల శాఖ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోదాడ ఎమ్మెల్యే నలమాద పద్మావతిని ఆలయ కమిటీ సభ్యులు శనివారం హైదరాబాద్‌లోని మంత్రి నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి ఆహ్వానించారు. ఈ నెల 19, 20, 21 తేదీల్లో ఆలయంలో నిర్వహించే విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన, శ్రీరామ కల్యాణ మహోత్సవాలకు ముఖ్య అతిథిగా హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బచ్చలకూరి ప్రకాశ్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు కొణతం చిన్నవెంకట్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు కొణతం సత్యనారాయణరెడ్డి, రాచకొండ రామ్మోహన్‌రావు, పులిజాల రమణారావు, గోళ్ల సుధాకర్, అలక సైదిరెడ్డి పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బందులు కలుగకుండా ధాన్యం కొనుగోళ్లు

- ఎమ్మెల్యే మందుల సామేల్

తిరుమలగిరి వ్యవసాయ మార్కెట్‌లో వరిధాన్యం పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మందుల సామేల్

తిరుమలగిరి, ఏప్రిల్ 13 : రైతులకు ఇబ్బందులు కలుగకుండా ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలని ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. రెండు రోజులు మార్కెట్‌కు సెలవులు ఉన్న కారణంగా శనివారం తిరుమలగిరి వ్యవసాయ మార్కెట్‌కు 818 మంది రైతులు 47,660 బస్తాల వరి ధాన్యం తీసుకువచ్చారు. ఆర్‌ఎన్‌ఆర్ రకం 5,820 బస్తాలు రాగా గరిష్ట ధర క్వింటాకు రూ.2,257, కనిష్ట ధర 1,700, మధ్యరకం 2,189 పలికింది. అలాగే ఐఆర్64 రకం 41,690 బస్తాలు రాగా గరిష్ట ధర రూ.1,980 కనిష్ట ధర 1,700, మధ్యరకం ధర క్వింటాకు 1,919 పలికింది. ఎస్ఎం రకం ధాన్యం 105 బస్తాలు రాగా గరిష్ట ధర రూ.2,017, కనిష్ట ధర 1,923, మధ్యరకం ధర 2,017 పలికింది. హెచ్ఎంటీ రకం ధాన్యం 45 బస్తాలు రాగా గరిష్ట ధర రూ.1,800, కనిష్ట ధర 1,800, మధ్యరకం 1,800 పలికింది. ధాన్యాన్ని ఎమ్మెల్యే పరిశీలించి మాట్లాడారు. వ్యాపారులు ఇష్టం వచ్చినట్లు తక్కువ ధరలకు కొనుగోలు చేస్తే చర్యలు తీసుకోవటం జరుగుతుందని హెచ్చరించారు. రైతులకు అన్యాయం జరిగేతే సహించేది లేదన్నారు. రోజుకు 2 వేల బస్తాలకు పైగా టోకెన్లు ఇవ్వాలని సూచించారు. రైతులకు మద్దతు ధర చెల్లించాలని అన్నారు. మార్కెట్‌కు భారీగా ధాన్యం వచ్చినందున ఆదివారం వారంతపు సెలవుతో పాటు సోమవారం కూడా వ్యవసాయ మార్కెట్‌కు సెలవు ప్రకటిస్తున్నట్లు కార్యదర్శి శ్రీధర్ తెలిపారు. మంగళవారం ఉదయం 5 నుంచి 10 గంటల లోపు మార్కెట్‌కు ధాన్యం తీసుకురావాలని సూచించారు.

కోమటికుంట చెరువు శిఖం భూముల ఆక్రమణ

చెరువు మట్టినే తీసుకువచ్చి పొలంగా చేస్తున్న ఆక్రమణదారులు

పాలకవీడు, ఏప్రిల్ 13 : మండలంలోని కోమటికుంట గ్రామంలో గల చెరువు, చెరువు శిఖం భూములను అక్రమార్కులు యథేచ్ఛగా ఆక్రమించుకుంటున్నారని గ్రామస్తులు వాపోతున్నారు. సాగర్ నీటి విడుదల లేకపోవడంతో చెరువు పూర్తిగా ఎండిపోయిందని దానిని ఆసరాగా తీసుకుని గ్రామంలో కొందరు అక్రమార్కులు చెరువును యదేచ్ఛగా ఆక్రమించుకుంటున్నారని వారు ఆరోపిస్తున్నారు. గ్రామంలో గల చెరువు భూముల్లో అదే చెరువు నుంచి జేసీబీలతో మట్టి తొడించి, పెద్ద పెద్ద వాహనాల్లో మట్టిని తెప్పించి మట్టిని పోయించి డోజర్లతో చదును చేస్తూ చెరువును ఆక్రమించుకుంటున్నట్లు తెలిపారు. ఇంత బహిరంగంగా చెరువును ఆక్రమిస్తున్నా పరిశీలించాల్సిన ఇరిగేషన్ శాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు పేర్కొంటున్నారు. ఇకనైనా చెరువును పరిశీలించి ఆక్రమణదారులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని, ఆక్రమించిన చెరువు భూములను స్వాధీనం చేసుకోవాలని కోరుతున్నారు. చెరువుకు హద్దులు నిర్ణయించాలని, జియో ట్యాగింగ్ చేయాలని లేకపోతే రానున్న రోజుల్లో చెరువు కనుమరుగయ్యే అవకాశం ఉంటుందన్నారు.

ఈ విషయమై ఎస్ఎస్సీ ఏఈ సతీశ్‌ను వివరణ కోరగా చెరువు ఆక్రమణలపై తమకు సమాచారం అందిందని, చెరువును పరిశీలించి ఆక్రమణదారులను గుర్తించి వారిపై కేసులు నమోదు చేస్తామని తెలిపారు. చెరువుకు హద్దులు నిర్ణయించి ఆక్రమణలను అడ్డుకుంటామని వెల్లడించారు.

పెన్‌పహాడ్‌లో జీవధ్వజ-విగ్రహాల ప్రతిష్ఠ

ధ్వజస్తంభం ప్రతిష్ఠ చేస్తున్న గ్రామస్తులు

పెన్‌పహాడ్, ఏప్రిల్ 13 : మండల పరిధిలోని పెన్‌పహాడ్ 'సీతారాంపురం'లో శనివారం వేలాది భక్తజనం నడుమ వేద పండితుల ఆధ్వర్యంలో సీతారామాంజనేయ లక్ష్మణ స్వామి దేవాలయంలో విగ్రహాల ప్రతిష్ఠ, జీవధ్వజ, గరుఢ ప్రతిష్ఠ కార్యక్రమాలను కనుల పండువగా నిర్వహించారు. దేవతా మూర్తుల ప్రతిష్ఠ అనంతరం గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేశారు.

ఉదయం విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవాచనం, పంచగవ్య పూజ, మార్జనలు పీఠార్చన రత్నన్యాసం, మూర్తిన్యాసమం, యంత్ర పూజ, విగ్రహ ప్రతిష్ఠ కళాన్యాసమ, పూర్ణహుతి నవత్యాంగ గోదర్శనం, కుంభ విక్షేపణ అవబృందం, దీక్షా విమోచనం, పండిత సత్కారం, స్వామి వారి ప్రథమ దర్శనం, స్వామి వారికి విశేష అర్చనతో పాటు తీర్థ ప్రసాద వితరణ చేపట్టారు. అలాగే సీతారాములకు శాంతి కల్యాణం నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.

ఎండల కాలం మూగ జీవాలు పైలం

- అధిక ఉష్ణోగ్రతలతో పొంచి ఉన్న ప్రమాదం

జీవాలను పరిశీలిస్తున్న పశు వైద్యులు (ఫైల్)

హుజూర్‌నగర్, ఏప్రిల్ 13 : ఎండలు మండుతున్నాయి. ఇటీవల ఉష్ణోగ్రతలు రోజు రోజుకి పెరిగిపోతున్నాయి. ఉదయం 8 గంటలు కాకముందే భానుడు భగ్గుమంటున్నాడు. ఇలాంటి పరిస్థితుల్లో మూగ జీవాలను పైలంగా చూసుకోవాల్సి ఉంటుందని హుజూర్‌నగర్ పశు వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా శాస్త్రీయ యాజమాన్య పద్ధతిలో పశువులు, జీవాలను పెంచడం వల్ల రైతులు ఆశించిన ఫలితాలు పొందవచ్చని తెలిపారు. వేసవి కాలంలో మూగ జీవాల్లో వచ్చే సమస్యలు, వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆయన వివరించారు.

పశువులు, జీవాల్లో వడదెబ్బ

అధిక ఉష్ణోగ్రత, గాలి ప్రసరణ సరిగ్గా లేకపోవడం, షెడ్లలో అధిక సంఖ్యలో కిక్కిరిసి ఉండడం, నీరు అందుబాటులో లేకపోవడం వల్ల పశువులు, గొర్రెలు, మేకలు వడదెబ్బకు గురవుతాయి. వడదెబ్బకు గురైన మూగ జీవాలు క్రమంగా నీరసించి బలహీనంగా మారుతాయి. సరిగ్గా నడవలేక తూలుతూ ఉంటాయి. ఎప్పుడూ పడుకోవడానికి ప్రయత్నిస్తాయి. జీవక్రియ తగ్గిపోతుంది. ఆకలి మందగిస్తుంది. ఆహారం తక్కువగా తీసుకుంటా యి. దీనివల్ల ఉత్పత్తి గణనీయంగా తగ్గిపోతుంది. వ్యాధి నిరోధక శక్తి తగ్గడం వల్ల ఇతర వ్యాధులు, పరాన్న జీవులు ఆశించే అవకాశం ఉంటుంది. కొన్ని సమయాల్లో దాహంతో ఉన్న పశువులు, జీవాలు మురికి గుంటల్లోని నీటిని తాగడంతో జీర్ణకోశ వ్యాధుల భారిన పడుతాయి. చూడి జీవాల్లో గర్భస్రావాలు సంభవిస్తాయి. వడవెబ్బకు గురైన వాటిలో దాహం పెరుగుతుంది. తూలుతూ, నడుస్తూ పడిపోతుంటాయి. రొప్పుతూ శ్వాస తీసుకోవడం కష్టంగా మారుతుంది. ఒక్కోసారి అపస్మారక స్థితికి వెళ్లి మృతి చెందే అవకాశమున్నది.

యాజమాన్య పద్ధతులు

జీవాలకు ఉదయం 6 నుంచి 10 గంటల వరకు, సాయంత్రం 5 నుంచి 7గంటల వరకు మేతకు తీసుకెళ్లాలి. ఒకవేళ ఎండ ఎక్కువగా ఉంటే చెట్టు నీడలో జీవాలు నిలబడేలా చూడాలి. షెడ్లకు ఇరువైపులా గోడలు పూర్తిగా కట్టకుండా చూడాలి. వీలైతే షెడ్లలో షవర్స్, స్ప్రింక్లర్లను అమర్చాలి. నీటి తుంపరలు జీవాల మీద పడేలా చర్యలు చేపట్టాలి. ముఖ్యంగా నల్లటి జీవాలకు (గేదే, నల్ల గొర్రె, మేక) ఇబ్బందులెక్కువ. నల్లటి శరీరం కలిగిన జీవాలు ఉష్ణోగ్రతను శోషణం చేసుకునే వీలుంటుంది.

పశువుల మేత

వేసవిలో పశువులను ఉదయం, సాయంత్రం వేళల్లో మాత్రమే మేతకు తీసుకెళ్లాలి. సాధ్యమైనంతవరకు ఎక్కువ నీళ్లు తాగేలా చూసుకోవాలి. గొర్రెలు, మేకలు, కోళ్లు, పశువుల రక్షణలో యాజమాన్య పద్ధతులు కచ్చితంగా పాటించాలి. వేసవి ప్రతాపంతో పశువుల్లో జీర్ణక్రియ మందగిస్తుంది. అందువల్ల సులువుగా జీర్ణించుకునే పిండి పదార్థాలైన గంజి, జావలాంటివి అందించాలి. ఎక్కువ శాతం పచ్చిగడ్డి ఇవ్వాలి. మాగుడు గడ్డి ఉంటే సమృద్ధిగా అందించవచ్చు. పచ్చిగడ్డిని ఉదయం సమయాల్లో, ఎండుగడ్డిని రాత్రి సమయాల్లో విభజించి కత్తిరించి ఇవ్వాలి. అధిక పాలను ఇచ్చే పశువులకు దాణాలో నీటిని కలిపి ఇవ్వాలి. మినరల్ మి క్చర్, ఉప్పు కలిగిన ద్రావణం ఇవ్వడం మంచిది.

ఆరోగ్య పరిరక్షణ

వేసవి తాపానికి గురైన పశువులు, జీవాల్లో వ్యాధి నిరోధక శక్తి తగ్గుతుంది. దానివల్ల ఇతర వ్యాధులు సంక్రమించే అవకాశం ఉన్నది. వ్యాధి నిరోధక టీకాలు సకాలంలో వేయించాలి. లేకపోతే పశువులు, గొర్రెలు, మేకలకు గాలికుంటు, గొంతు వాపు, జబ్బ వాపు లాంటి వ్యాధులు వస్తాయి. దాహంతో ఉన్న పశువులు మురుగు నీరు తాగడం వల్ల పారుడు, జీర్ణకోశ రోగం వచ్చే అవకాశం ఉన్నది. ఎల్లవేళలా మంచి చల్లని తాగునీరు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలి. అంతర పరాన్న జీవుల నిర్మూళనకు నట్టల నివారణ మందులు క్రమం తప్పకుండా తాగించాలి.

మూగ జీవాలకు వెంటనే చికిత్స చేయించాలి

వడదెబ్బకు గురైన పశువులు, జీవాలను వెంటనే చల్లని గాలి వీచే ప్రదేశంలోకి తీసుకెళ్లాలి. శరీర ఉష్ణోగ్రత తగ్గించడానికి పలుమార్లు నీటితో కడగాలి. తల, నుదుటి మీద మంచు ముక్కలు ఉంచడం, చల్లని గోనె సంచిని కప్పడం లాంటివి చేయాలి. వెంటనే పశు వైద్యుడిని సంప్రదించాలి. పశు వైద్యుడి పర్యవేక్షణలో గ్లూకోజ్, సెలైన్, సోడియం క్లోరైడ్ అందించాలి. శరీర ఉష్ణోగ్రతను తగ్గించడానికి అవసరమైన చికిత్స చేయించాలి.

- కొణతం శ్రీనివాస్‌రెడ్డి, పశు వైద్యాధికారి, హుజూర్‌నగర్

సింగారెడ్డిపాలెంలో ధాన్యం కొనుగోళ్లు ప్రారంభం

- అలాట్‌మెంట్ పత్రాన్ని అందజేసిన అదనపు కలెక్టర్ బీఎస్.లత
- 'నమస్తే' కథనానికి స్పందన

సింగారెడ్డిపాలెంలో తాసీల్దార్ మహేందర్‌రెడ్డి, సెర్ప్ సిబ్బందికి సూచనలు చేస్తున్న అదనపు కలెక్టర్ బీఎస్.లత

పెన్‌పహాడ్, ఏప్రిల్ 13 : మండలంలోని సింగారెడ్డిపాలెం గ్రామంలో ప్రభుత్వ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. శనివారం నమస్తే తెలంగాణ దిన పత్రికలో 'ధాన్యం కొనుగోలుకు అన్నదాత పడిగాపులు' అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి స్పందించిన అదనపు కలెక్టర్ బీఎస్.లత సింగారెడ్డిపాలెం గ్రామాన్ని సందర్శించి స్వయంగా కొనుగోలు కేంద్రం అలాట్‌మెంట్ పత్రాన్ని అందజేసి ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలని నిర్వాహకులకు సూచించారు. శనివారం నుంచే ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించాలని అందుకు కావాల్సిన ఐరిస్, కాంటాలు, గన్నీ బ్యాగులు, ప్యాడీ క్లీనర్ కేంద్రానికి సరఫరా చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కొనుగోళ్లలో అవకతవకలకు పాల్పడితే బాధ్యులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎప్పటికప్పుడు ధాన్యం కొనుగోలుపై సమగ్ర సమాచారాన్ని జిల్లా గ్రూప్‌లో పొందుపరుచాలన్నారు. రైతులు తమ ధాన్యాన్ని ఆరబెట్టుకుని కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చి నిర్వహణ సిబ్బందికి సహకరించాలని పేర్కొన్నారు. అంతకుముందు అదనపు కలెక్టర్ మహ్మదాపురంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో తాసీల్దార్ మహేందర్‌రెడ్డి, ఏపీఎం అజయ్‌నాయక్, ఏఓ కృష్ణసందీప్, సీసీ చెన్నయ్య, నిర్వాహకులు రాయి శైలజ, కంచెర్ల లలిత, చంద్రకళ, ఉమ, స్వరూప పాల్గొన్నారు.

తిరుమలగిరి వ్యవసాయ మార్కెట్ పరిశీలన

తిరుమలగిరి : తిరుమలగిరి వ్యవసాయ మార్కెట్‌కు శనివారం భారీగా వరి ధాన్యం వచ్చింది. దాంతో జిల్లా అదనపు కలెక్టర్ బీఎస్.లత మార్కెట్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసి ధాన్యాన్ని పరిశీలించారు. కమీషన్‌దారులు, ఖరీదుదారులతో ధరల హెచ్చుతగ్గుల గురించి మాట్లాడి రైతులకు సూచనలు చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కార్యదర్శి శ్రీధర్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో బాలుడి మృతి

మఠంపల్లి, ఏప్రిల్ 13 : రోడ్డు ప్రమాదంలో బాలుడు మృతి చెందిన ఘటన మండలంలోని రఘునాథపాలెం గ్రామ శివారులో శనివారం జరిగింది. ఎస్ఐ రామాంజనేయు లు తెలిపిన వివరాల ప్రకారం.. చింత్రియాల గ్రామానికి చెందిన చెడపంగు కృష్ణయ్య అతడి కొడుకు పవన్‌కుమార్ (9) తో కలిసి బైక్‌పై మఠంపల్లి నుంచి చింత్రియాల గ్రామానికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో ఎదురుగా వస్తున్న టిప్పర్ అదుపుతప్పి బైక్‌ను ఢీకొట్టడంతో తండ్రికొడుకులు రోడ్డుపై పడ్డారు. పవన్‌కుమార్ పై నుంచి టిప్పర్ వెళ్లడంతో బాలుడు అక్కడికక్కడే మృతిచెందాడు. కృష్ణయ్య స్వల్ప గాయాలతో ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

నడిరోడ్డుపై పడుకుని సెల్ఫీ

- సూర్యాపేటలో యువకుడి పైశాచికం
- మద్యం మత్తా? గంజాయి మైకమా?

నడి రోడ్డుపై పడుకుని కాలుమీద కాలు వేసుకుని సెల్ఫీ తీసుకుంటున్న యువకుడు

బొడ్రాయిబజార్, ఏప్రిల్ 13 : మద్యం మత్తో లేక గంజాయి మైకమో తెలియదు గానీ సూర్యాపేట జిల్లా కేంద్రంలో నడిరోడ్డుపై ఓ యువకుడి పైశాచిక చేష్టలకు వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. జిల్లా కేంద్రంలోని మహాత్మాగాంధీ రోడ్డులో తెలంగాణ తల్లి విగ్రహం వద్ద ఓ యువకుడు నడిరోడ్డుపై పడుకుని కాలు మీద కాలు వేసుకుని సిగరెట్ తాగుతూ సెల్ఫీలు దిగాడు. ఇలా అరగంట పాటు తన ఇష్టారీతిన సెల్ఫీ ప్రదర్శన చేశాడు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉండేలా అధికారులు, పోలీసులు చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరారు.

కార్మికులకు కనీస వేతనం చెల్లించాలి

- సీఐటీయూ నాయకులు

పరిశ్రమ అధికారికి వినతిపత్రం ఇస్తున్న సీఐటీయూ నాయకులు

మేళ్లచెర్వు, ఏప్రిల్ 13 : సిమెంట్ పరిశ్రమల్లో పనిచేసే కాంట్రాక్ట్ కార్మికులకు నెలకు రూ.15 వేల కనీస వేతనం చెల్లించాలని సిమెంట్ క్లస్టర్ పరిశ్రమ వర్కర్స్ యూనియన్ జిల్లా కన్వీనర్ వట్టెపు సైదులు అన్నారు. శనివారం మండల పరిధిలోని రామాపురంలో జరిగిన రెయిన్ (ప్రియా) సిమెంట్స్ వర్కర్స్ యూనియన్ సమావేశంలో ఆయన మాట్లాడారు. పెరుగుతున్న ధరలతో చాలీచాలని వేతనాలతో కార్మికుల జీవనం కష్టంగా మారిందన్నారు. ఈ మేరకు పరిశ్రమ అధికారి అంజయ్యకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు ప్రకాశ్, శ్రీను, అజాముద్దీన్, రామారావు, ఆంజనేయులు, వెంకట్‌రెడ్డి, నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

నేరేడుచర్ల జడ్పీహెచ్ఎస్‌లో సీసీ కెమెరాల ఏర్పాటు

నేరేడుచర్ల జడ్పీహెచ్ఎస్‌లో సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న ఎస్ఐ రవీందర్‌నాయక్

నేరేడుచర్ల, ఏప్రిల్ 13 : నేరేడుచర్ల జడ్పీ హెచ్ఎస్ పాఠశాల 2003-04 పదో తరగతి విద్యార్థులు రూ.30 వేలు వెచ్చించి పాఠశాలలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయగా శనివారం ఎస్ఐ రవీందర్‌నాయక్ శనివారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానం అన్నారు. పాఠశాల భద్రత కోసం సీసీ కెమెరాలను ఏర్పాటు చేయించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం బట్టు మధు, శ్రావణి, ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

పూలే ఆశయ సాధనకు కృషి చేయాలి

- సగర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పరి శేఖర్

బొడ్రాయిబజార్, ఏప్రిల్ 13 : బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి మహాత్మా జ్యోతిబా పూలే అని ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని సగర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పరి శేకర్ సగర అన్నారు. సగర సంఘం ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని కర్మాన్‌ఘాట్ ఆంజనేయస్వామి దేవాలయం నుంచి ఈ నెల 7న ప్రారంభమైన పాదయాత్ర 6వ రోజు సూర్యాపేటకు చేరిన సందర్భంగా ఆయన మాట్లాడారు. పాదయాత్ర ఈ నెల 16న భద్రాచలంలో ముగుస్తుందని తెలిపారు. 17న శ్రీరామనవమి సందర్భంగా సీతారామచంద్రస్వామి కల్యాణానికి పట్టు వస్త్రాలు, తలంబ్రాలు, ఒడిబియ్యం తామే అందజేయనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో రాష్ట్ర సగర సంఘం ముఖ్య సలహాదారు ఆర్.బి.ఆంజనేయులు, ఉపాధ్యక్షుడు పెద్దబుడ్డుల సతీశ్, కార్యనిర్వాహక కార్యదర్శి చీర్ల విష్ణు, యువజన సంఘం అధ్యక్షుడు మర్క సురేశ్, ప్రధాన కార్యదర్శి ఉప్పరి మహేందర్, నాయకులు తిరుమలేశ్, గణేశ్, మధు పాల్గొన్నారు.

'పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్‌ను ఓడించాలి'

కట్టంగూర్, ఏప్రిల్ 12 : త్వరలో జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలను ఓడించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు తుమ్మల వీరారెడ్డి అన్నారు. పార్టీ భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి ఎండి.జహంగీర్‌ను గెలిపించాలని కోరుతూ శనివారం మండలంలోని మునుకుంట్ల, ఇస్మాయిల్ పల్లి గ్రామాల్లో ఇంటింటి ప్రచారంతో పాటు ఉపాధి హామీ కూలీలను కలిసి ఓటు అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తీవ్ర కరువుతో పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవడంతో రాష్ట్ర ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. ప్రజల పక్షాన పోరాడుతున్న జహంగీర్‌కు ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు గంజి మురళీధర్, దండెపల్లి సత్తయ్య, మండల కార్యదర్శి పెంజర్ల సైదులు, కట్ట బక్కయ్య, జాల రమేశ్, ఊట్కూరి యాదయ్య, ఊట్కూరి సుజాత, పెంజర్ల కృష్ణ, జాల అంజనే యులు, గోగి రెడ్డి సందీప్‌రెడ్డి పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం

త్రిపురారం, ఏప్రిల్ 13 : మండలంలోని పలుగుతండా గ్రామానికి చెందిన రమావత్ రంగా (26) అనే యువకుడు మిర్యాలగూడలో నివాసం ఉంటున్నాడు. కుటుంబ కలహాల కారణంగా భార్య త్రిపురారం మండలం బడాయిగడ్డ గ్రామానికి వెళ్లగా గత నెల 29న రంగా కూడా తన భార్య కోసమని అత్తగారి ఊరుకు వెళ్లాడు. అక్కడి నుంచి తన తల్లి రమావత్ కమలకు ఫోన్ చేసి నేను ఇంటి నుంచి వెళ్లిపోతున్నానని చెప్పాడు. ఆ రోజు నుంచి బంధువులకు ఫోన్ చేసినా ఆచూకి తెలియలేదు. ఇప్పటికీ ఇంటికి రాకపోవడంతో రంగా తల్లి కమల శనివారం ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కె.వీరశేఖర్ తెలిపారు.

నాలుగు ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను పట్టుకున్న పోలీసులు

తిరుమలగిరి, ఏప్రిల్ 13 : అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను పోలీసులు పట్టుకున్నారు. ఈ ఘటన శనివారం మండల కేంద్రంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..అనంతారం బిక్కేరు వాగు నుంచి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తుండగా రైడ్ చేసి పట్టుకుని కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు.

భారతీయుల పవిత్ర గ్రంథం భారత రాజ్యాంగం

- బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సుదర్శన్‌రెడ్డి

కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతున్న బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సుదర్శన్‌రెడ్డి

బొడ్రాయిబజార్, ఏప్రిల్ 13 : మన దేశంలో పుట్టిన ప్రతి పౌరుడికి అన్ని విధాల విద్య, ఉద్యోగం, అభివృద్ధి, సంక్షేమం, సమాన హక్కులు, అవకాశాలు కల్పించిన ఏకైక భారతీయుల విశ్వాస గ్రంథం భారత రాజ్యాంగం అని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నూకల సుదర్శన్‌రెడ్డి అన్నారు. శనివారం తెలంగాణ ఎస్సీ మహిళా డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ శైలజ అధ్యక్షతన ఏర్పాటు చేసిన డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ జయంతి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులంతా అంబేద్కర్‌ను స్ఫూర్తిగా తీసుకుని మంచి చదువులు చదివి జ్ఞానవంతులు కావాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో న్యాయవాది తలమల్ల హసేన్, న్యాయ సేవా సంస్థ సభ్యుడు మారపాక వెంకన్న, డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ బొల్లెద్దు వెంకటరత్నం, న్యాయవాది కోక రంజిత్, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

మట్టపల్లి గోశాలకు పశుగ్రాసం అందజేత

నేరేడుచర్ల : మట్టపల్లి గోశాలకు పశుగ్రాసం అందజేస్తున్న వాసవీ, వనితా క్లబ్ సభ్యులు

నేరేడుచర్ల, ఏప్రిల్ 13 : నేరేడుచర్ల వాసవీ, వనితా క్లబ్ ఆధ్వర్యంలో శనివారం మట్టపల్లిలోని రాజ్యలక్ష్మి గోశాలకు సుమారు రూ.15 వేల విలువ గల రెండు ట్రాక్టర్ల పశుగ్రాసంతో పాటు ఉలవలు, బెల్లం, ఆకుకూరలు, పండ్లు అందజేశారు. కార్యక్రమంలో వాసవీ, వనితా క్లబ్ సభ్యులు జూలూరి అశోక్, కొత్తా లక్ష్మణ్, రాచకొండ శ్రీనివాస్‌రావు, కందిబండ శ్రీనివాస్‌రావు, పోలిశెట్టి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

గరిడేపల్లి : మండల కేంద్రానికి చెందిన కొలిపాక కృష్ణ, పెండెం అరవింద్, చామకూరి వీరబాబు మట్టపల్లి లక్ష్మీనర్సింహ స్వామి దేవాలయ గోశాలకు మూడు ట్రాక్టర్ ట్రక్కుల గడ్డిని అందజేశారు.